ప్రజాశక్తి
బుధవారం 29 జనవరి 2025

ఉత్సవాల్లో పిల్లల సంరక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించనున్న రథసప్తమి వేడుకల్లో బాలల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అధికారులకు సూచించారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్యూలైన్లలో తల్లులు పాల కేంద్రాలను ఏర్పాటు చేయాలని, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక ప్రవేశాలు కల్పించాలని సూచించారు. వికలాంగ బాలలకు ట్రైసైకిళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న కొనుగోలుదారులు

మరో బాదుడు

- ఒకటి నుంచి ఆస్తుల విలువ పెంపు
- ఆయా ప్రాంతాల డిమాండ్‌ను బట్టి రేటు
- పది నుంచి 50 శాతం వరకు పెంచేందుకు సిద్ధం
- ప్రభుత్వానికి ఏటా రూ.4.5 కోట్ల వరకు ఆదాయం



టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఒక్కొక్కటిగా షాక్ ఇస్తోంది. గతేడాది డిసెంబరులో ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో కరెంట్ ఛార్జీలను విపరీతంగా పెంచింది. ఇప్పుడు స్థిరాస్తుల విలువలను అమాంతంగా పెంచి, మరో భారాన్ని మోపేందుకు సిద్ధమవుతోంది. భూములతో పాటు ప్లాట్లు, ఇళ్లు తదితర స్ట్రక్చర్ల విలువలను పెంచనుంది. ఏ ప్రాంతంలో ఎంతమేర పెంచాలన్నది అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా రేట్లు నిర్ణయించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న డిమాండ్‌ను బట్టి జాయింట్ కలెక్టర్ అధ్వర్యంలోని కమిటీ ధరలను ఆమోదించే ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలోని స్థిరాస్తుల ధరలపై ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా సబ్ రిజిస్ట్రార్ అధికారులు మండలాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కొత్త ధరలను సిద్ధం చేశారు. జిల్లాలో ఏడెనిమిది నెలలుగా ఈ ప్రక్రియ సాగింది. ప్రస్తుతం ధరల పెంపులో ప్రభుత్వం కొన్ని క్లాసిఫికేషన్లు మార్చింది. ప్రతి ప్రాంతంలో భూమికి ఒకే విలువ అమల్లో ఉంది. ఇప్పుడు దానికి రెండో విలువను ప్రభుత్వం జోడిస్తోంది. లేయర్లు, గ్రిడ్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. మెట్ట, మాగాణి భూముల్లో రకరకాల క్లాసిఫికేషన్స్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ విధానంలో రోడ్డుకి ఆనుకున్న భూమికి ఒక ధర, దాని పక్కన ఉన్న భూమికి మరో రేటు అమలు కానుంది.

అర్బన్ ప్రాంతాల్లోనూ క్లాసిఫికేషన్స్ మార్చింది. రోడ్ల పక్కన ఉన్న స్థలాలకు ఒక ధర, సందుల్లో ఉన్న వాటి వెనుక స్థలాలకు మరో రేటు నిర్ణయించింది. వాణిజ్య స్థలాలకు సంబంధించి నాలుగైదు రకాలుగా మార్చింది. దీంతో వ్యవసాయ, నివాస, వాణిజ్య భూములతో పాటు అర్బన్ ప్రాంతాల్లోని అన్ని స్థలాల మార్కెట్ విలువలు భారీగా పెరగనున్నాయి.

ఆస్తుల విలువ పెంపు ఇలా...

జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, కోటబొమ్మాళి, టెక్కలి, కాశీబుగ్గ, సోంపేట, మందస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, హిరమండలం, పొందూరు, రణస్థలం, పాతపట్నం ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి తదితర క్షేత్రస్థాయి అధికారులతో కలిసి గ్రామాల్లో పర్యటించి ఎనిమిది నెలల కిందటే ఆస్తుల విలువను మదింపు ప్రక్రియ చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో భూములు, ఇతర స్థిరాస్తుల ధరలను తెలుసుకున్నారు. వాటిని క్రోడీకరించి జెసి ఆధ్వర్యంలోని కమిటీకి నివేదించారు. కమిటీ వాటికి ఆమోదం తెలపడంతో, ధరల పెంపునకు సిద్ధమవుతున్నారు. వాణిజ్యపరంగా డిమాండ్ ఉన్న ప్రాంతాలు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పాటు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూములకు డిమాండ్‌ను బట్టి ధరను నిర్ణయించారు. డిమాండ్ లేని మారుమూల ప్రాంతంలో పది శాతం వరకు పెంచారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రహదారి, పొట్టి శ్రీరాములు కూడలి, రామలక్ష్మణ, సూర్యమహల్ కూడలి, ఏడు రోడ్ల కూడలి తదితర వాణిజ్య ప్రాంతాల్లో గరిష్టంగా 50 శాతం వరకు పెరగనుంది. పలాస - కాశీబుగ్గ, ఆమదాలవలస, రణస్థలం, పైడిభీమవరం ప్రాంతాల్లోనూ స్థిరాస్తుల విలువ 50 శాతం వరకు పెరగనుంది.

సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ల ద్వారానే అధిక ఆదాయం

జిల్లాలో ఏటా 75 వేల నుంచి లక్ష వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఇందులో సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్లు, రుణాలు, మార్ట్‌గేజ్, పిఎసిఎస్ రుణాలు తదితర కేటగిరీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. వీటిలో 20 వేల వరకు సేల్ డీడ్స్ ఉంటాయి. వీటి ద్వారానే ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ రుసుము, స్టాంప్ డ్యూటీ రూపంలో అధికంగా ఆదాయం సమకూరనుంది. స్టాంప్ డ్యూటీ రూపంలో 6.5 శాతం, ఒక శాతం రుసుము వసూలు చేయనున్నారు. గిఫ్ట్ డీడ్ కింద రక్తసంబంధీకులైతే 1.2 శాతం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము ఒక శాతం వసూలు చేయనున్నారు. ఇతరులైతే మూడు శాతం స్టాంప్ డ్యూటీ, 0.5 శాతం రిజిస్ట్రేషన్ రుసుము తీసుకోనున్నారు. ఇలా పలు కేటగిరీలకు నిర్ణయించిన మేరకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేయనున్నారు.

ఆస్తుల విలువ పెంపుతో రూ.4.5 కోట్ల ఆదాయం

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.22.57 కోట్లను లక్ష్యంగా నిర్దేశించారు. గతేడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి రూ.13.84 కోట్ల ఆదాయం వచ్చింది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా రెండు నెలల సమయమే ఉంది. అంతమేర ఆదాయం వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. గతేడాది రూ.15.39 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రస్తుతం పెంచిన భూముల విలువతో రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా అదనంగా రూ.నాలుగు కోట్ల నుంచి రూ.4.5 కోట్ల వరకు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆస్తుల విలువ పెంపు ప్రచారంతో పెరిగిన రిజిస్ట్రేషన్లు

స్థిరాస్తుల విలువలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పెరుగుతాయనే ప్రచారంతో ఆస్తుల క్రయ విక్రయాలు ఊపందుకున్నాయి. సాధారణ రోజుల్లో రోజుకి 200 నుంచి 250 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ప్రస్తుతం రోజుకి 300 నుంచి 350 వరకు పెరిగాయి.

సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి ద్వారకా తిరుమలరావు

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల అదుపు

- సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి
- గంజాయి మూలాలపై ఉక్కుపాదం
- డిజిపి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరాలను అరికట్టాలని డిజిపి ద్వారకా తిరుమలరావు అన్నారు. జిల్లా పర్యటనకు మంగళవారం వచ్చిన ఆయన ఎస్‌పి కార్యాయంలో జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నాయని, గతేడాదితో పోలిస్తే 17 శాతం నేరాలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు. బీహార్ సుపారీ గ్యాంగ్‌తో సహా టెంపుల్, చైన్ స్నాచర్ల నేరస్తులు పట్టుకోవడం, ప్రాపర్టీ రికవరీలో జిల్లా పోలీసులు సమర్థవంతంగా పనిచేశారని కితాబునిచ్చారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు ఛేదించడం గొప్ప విషయమన్నారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో ప్రజలకు పారదర్శకమైన సేవలందించి పోలీసుశాఖ పేరు ప్రతిష్టలను పెంచాలని సూచించారు. సిసి కెమెరాల్లో రికార్డయ్యే నేరాన్ని తెలుసుకుని త్వరితగతిన ఛేధించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 460 సిసి కెమెరాలు పనిచేస్తున్నాయని, మరో 520 కెమెరాలు అదనంగా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అరోగ్య రక్ష కింద జిల్లా పోలీసులకు ఆరోగ్య పరీక్షలు చేయించి, డిజిటల్ హెల్త్‌కార్డులు జారీ చేయాలని, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను ఛేదించాలని సూచించారు. అనంతరం ఆయన్ను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి, ఎస్‌పి మహేశ్వర రెడ్డి శాలువతో సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో ఆయన కొబ్బరి మొక్కను నాటారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్ సందర్శన

ఎపిఎస్ ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో ఆయన శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలోని శ్రీకాకుళం ఒకటి, రెండో డిపో గ్యారేజీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఒకటో డిపో గ్యారేజీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆర్‌టిసి ఆదాయం పెంచేందుకు అంతా కష్టపడి చేయాలని సూచించారు. ఖర్చులు తగ్గించుకోవాలని చెప్పారు. ఆర్‌టిసి సిబ్బందికి సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2017 నుంచి రావాల్సిన బకాయిలను రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ ఇడి ఎ.విజయ కుమార్, విశాఖపట్నం డిపిటిఒ బి.అప్పలనాయుడు, ఒకటి, రెండో డిపోల మేనేజర్లు అమరసింహుడు, రవిశంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

డిజిపిని కలిసిన కలెక్టర్

జిల్లా పర్యటనకు వచ్చిన డిజిపి ద్వారకా తిరుమలరావును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు పి.శ్రీనివాసరావు, కె.వి రమణ, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకల్లో కళల జాతర

3న ఆర్ట్స్ కళాశాల వేదికగా ప్రదర్శనలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర పండగగా ప్రకటించిన అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి కోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి మూడో తేదీన నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రాథమికంగా ప్రకటించారు. ఈ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి మూడో తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు ప్రవేశం ఉచితం. పార్కింగ్ కోసం కోడి రామ్మూర్తి స్టేడియంను సిద్ధం చేస్తున్నారు. ఆర్ట్స్ కళాశాలలో ఫుడ్ స్టాల్స్ కూడా అందుబాటులో ఉంటాయి. క్లాసికల్ సంగీతం, నృత్యం, ఫోక్ డ్యాన్స్, వెస్ట్రన్ డ్యాన్స్ వంటి అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రముఖ గాయకులు మంగ్లీ, జాతీయస్థాయి సంగీత కళాకారులు, నర్తకులు ఈ వేడుకకు హాజరవుతున్నారు.

ఫిబ్రవరి మూడో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ బృందం సినీ లైట్ క్లాసికల్ మ్యూజిక్‌తో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి. 3.15 గంటలకు దుంప ఈశ్వర్ ఆధ్వర్యాన సినీ క్లాసికల్ మ్యూజిక్, 3.30 గంటల నుంచి యామిని కృష్ణ ఆధ్వర్యాన క్లాసికల్ వోకల్ ప్రదర్శన ఉంటుంది. 3.45 నుంచి నాలుగు గంటల వరకు పరిమళ గ్రూప్ ఆధ్వర్యంలో క్లాసికల్, ఫోక్ డాన్స్, నాలుగు గంటల వరకూ శ్రీమతి అనురాధ ఆధ్వర్యాన క్లాసికల్ డాన్స్, 4.15 నుంచి 4.45 గంటల వరకు సుందరంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యాన సాక్సోఫోన్ సంగీత ప్రదర్శన ఉంటాయి. 4.45 గంటల నుంచి మావుడూరు శ్రీనివాస శర్మ క్లాసికల్ వయోలిన్, 5.15 గంటలకు లక్ష్మీ గణపతి శర్మ సినీ క్లాసికల్ మ్యూజిక్, 5.45 గంటలకు నీరజ సుబ్రమణ్యంతో క్లాసికల్ డాన్స్, ఆరు గంటలకు రఘుపాత్రుని శ్రీకాంత్ క్లాసికల్ డాన్స్, 6.30 గంటలకు సంప్రదాయం కూచిపూడి గురుకులం యోగా డాన్స్, 7 గంటలకు సభా కార్యక్రమం లేజర్ షో, 8 గంటలకు జోష్ శివ వెస్ట్రన్ డాన్స్, 8.15కి ప్రముఖ గాయని మంగ్లీ బృందంతో సినీ మ్యూజిక్, 10.15కి పెద్ద ఎత్తున బాణాసంచా వెలుగులతో కార్యక్రమం ముగిస్తుంది.

2, 3న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

రథసప్తమి వేడుకల సందర్భంగా ఫిబ్రవరి 2, 3 తేదీల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్, జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్, గ్రామీణ క్రీడలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల విజేతకు రూ.లక్ష, జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల విజేతకు రూ.20 వేలు, గ్రామీణ క్రీడల విజేతలకు మొత్తం రూ.60 వేలు చొప్పున ప్రైజ్‌మనీ ఉంటుందన్నారు. పోటీలకు సంబంధించిన అన్ని వివరాల కోసం 9949861168 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వంశధార ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వంశధార ప్రాజెక్టు ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు వెంటనే కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, మండల నాయకులు హనుమంతు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. వంశధార ప్రాజెక్టు జిల్లా అభివృద్ధికి గుండెకాయ వంటిదన్నారు. వంశధార ప్రాజెక్టు నిర్మించి 50 ఏళ్లు కావస్తోందని, ఆ ప్రాజెక్టు శిథిలమైతే జిల్లాలో వ్యవసాయ రంగం మొత్తం కుప్పకూలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వంశధార నది ఎడమ కాలువ ద్వారా 1.50 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలు, హై లెవల్ కెనాల్ ద్వారా ఐదు వేల ఎకరాలు, ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా 20 వేల ఎకరాలకు నీరందిస్తుందని వివరించారు. వంశధార ప్రాజెక్టు నిర్వహణకు నిధుల్లేక శిథిలావస్థలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార ఆధునీకరణ కోసం కుడి కాలువ 104 కిలోమీటర్లు, ఎడమ కాలువ 73 కిలోమీటర్లు పొడవునా లైనింగ్ చేయడం కోసం రూ.800 కోట్లు, 250 స్ట్రక్చర్స్ పునర్నిర్మాణానికి రూ.300 కోట్లు, షట్టర్స్ కోసం రూ.వంద కోట్లు, పిల్ల కాలువల మరమ్మతుల కోసం రూ.300 కోట్లు అవసరమవుతాయని నిపుణులు చెప్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పాలకుల నిర్లక్ష్యమే జిల్లా వెనుకబాటుకు కారణమన్నారు. వంశధార ప్రాజెక్టు ఆధునీకరణ చేసి రెండు పంటలకు నీరు ఇస్తే వ్యవసాయ రంగం నుంచి రూ.వెయ్యి కోట్లకు పైగా ఆదాయం వస్తోందని, తద్వారా ప్రజల కొనుగోలుశక్తి పెరుగుతోందన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

సుందరీకరణ పనులు సత్వరం పూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని చేపడుతున్న నగర సుందరీకరణ పనులను సత్వరం పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. సుందరీకరణ పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. కొత్తరోడ్డు మొదలు అరసవల్లి వరకు చేపడుతున్న పనులను పరిశీలించిన ఆయన పలుచోట్ల లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దాలని సూచించారు. సుందరీకరణ పనులు పర్యవేక్షిస్తున్న ప్రజారోగ్య శాఖ ఇఇ పి సుగుణాకర్‌తో ఆయన పలు అంశాలను చర్చించారు. సెంటర్ డివైడర్, లైటింగ్ తదితర అంశాలపై చర్చించారు. డివైడర్లలో గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. త్వరితగతిన పోల్స్ అమర్చి విద్యుత్ లైన్లు వేయాలన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నాటికి విద్యుత్ కాంతులు నగరవాసులకు సరికొత్త అందాలను తెచ్చి పెట్టేవిగా కనిపించాలన్నారు. రెండో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు శోభాయాత్ర పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభం కావాలన్నారు. శకటాలు, కోలాటం, తప్పెటగుళ్లు, కర్రసాము, కొమ్ము డాన్స్, కోయ డాన్సుల వంటి సాంస్కృతిక బృందాలను శోభాయాత్రలో వినియోగించాలన్నారు. సుందరీకరణ పనుల్లో భాగంగా ఎక్కడైనా దుకాణదారులను తొలగిస్తే, వారికి కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు నగరపాలక సంస్థ సహకారాన్ని అందించాలన్నారు. అనంతరం అరసవల్లిలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ జాన్ సుధాకర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.విడి ప్రసాదరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిపిఒ భారతీ సౌజన్య, ఆలయ ఇఒ వై.భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

వికలాంగులు సమాజంలో భాగమే...

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో జిల్లాలోని వికలాంగులకు ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి వికలాంగుల ఉపకరణాల పంపిణీకి అర్హత పరీక్షలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. జిల్లాలో సుమారు రూ.50 లక్షలు సిఎస్‌ఆర్ కింద ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఖర్చు చేస్తోందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన ఆప్టిమైజ్డ్ వర్క్‌ఫ్లోలు, అత్యంత నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్ తయారీ సౌకర్యాలతో అధిక నాణ్యత గల పరికరాలను అందించడానికి అర్హులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. పలాస, టెక్కలి, శ్రీకాకుళం డివిజన్లలో ఈ శిబిరాలను నిర్వహించడం ద్వారా అర్హులైన వారికి మూడు చక్రాల బ్యాటరీ వాహనాలు అందించనున్నామన్నారు. మీకోసం కార్యక్రమంతో పాటు వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో పలువురు దరఖాస్తులు ఇచ్చారని, అందులో అర్హులకు ఈ శిబిరాల ద్వారా గుర్తించి కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిల్, వాకింగ్ స్టిక్స్, ఇతర ఉపకరణాలను అందజేయనున్నట్లు తెలిపారు. అర్హత పొందిన 45 రోజుల్లోనే ఉపకరణాల పంపిణీ చేపట్టనున్నట్లు చెప్పారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ శ్రీకాకుళం డివిజన్‌లో 746 మంది వికలాంగులకు ఈ పరీక్షలు నిర్వహించడమైందని, అర్హతల ఆధారంగా ఉపకరణాలు వచ్చిన తర్వాత పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, వికలాంగుల శాఖ ఎడి కె.కవిత, వైద్యులు పాల్గొన్నారు.

రథసప్తమి ఉత్సవాలకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించే రథసప్తమి ఉత్సవాలకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. రథసప్తమి బందోబస్తు, భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథసప్తమి వేడుకలకు పెద్ద సంఖ్యలో యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతియుతంగా నిర్వహించేలా భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం సిసి టివి, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలన్నారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి పోలీసు సిబ్బంది, అధికారులను సమన్వయం చేసుకుంటూ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ ప్రాంతాలు, లైటింగు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పెద్ద వాహనాలు రాకుండా అవసరమైన ప్రదేశాల్లో ట్రాఫిక్ మళ్ళింపులు చేయాలని సూచించారు. దర్శన టికెట్ కౌంటర్లు, ప్రసాదం విక్రయ కేంద్రాలు, పార్కింగ్ ప్రాంతాలు ప్రజలకు తెలిసే విధంగా సూచిక బోర్డులను సంబంధిత అధికారులతో సంప్రదించి ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు వివేకానంద్, అప్పారావు, ప్రసాదరావు, శేషాద్రి, సిఐలు, ఆర్ఐ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

IN THE HONOURABLE COURT OF THE 15 ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM
E.P. No.33/2023 in A.A. No.451/2021

Between:
M/s. Shriram Transport Finance Company Ltd., Narasannapeta Branch, Rep. by its Power of Attorney Holder Sri. Bonu Venkata Ravi Sankar ....**DHR**
And: **1. Simma Govinda Rao 2. Naru Gopi** ....**JDRs**
To,
1. Simma Govinda Rao, S/o Jagannadham, Hindu, aged 34 years, H.No..2-42A, Gatlapadu Village, Peddabammidi Post, Kotabommali Mandal, Srikakulam District.
2. Naru Gopi, S/o Appa Rao, Hindu, aged 38 years, Gatlapadu Village, Peddabammidi Post, Kotabommali Mandal, Srikakulam District

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ అస్థిని పై నెంబరు అవార్డు సొమ్ము రాబట్టే నిమిత్తము శ్రీ రామ్ ట్రాన్స్ పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, నరసన్నపేట శాఖ వారు E.P అమలుపరచి యున్నారు. పై కోర్టు వారు అమలు నిమిత్తం దిగువ షెడ్యూల్ గల ఆస్తిని వేలం వేయడానికి ఆర్డర్ వేసి యున్నారు. కావున దిగువ గల షెడ్యూల్ ఆస్తినకు బహిరంగముగా వేలం వేయబడును. పై కోర్టులో **తేది 07-02-2025 ఉ॥ 10:30 నిమిషాల నుండి సా॥ 5:00 గంటల మధ్యకాలంలో బహిరంగంగా వేలం వేయబడును.** కావున ఆసక్తిగల ఆసాములు బహిరంగముగా వేలం లో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY OF JDR-1

ITEM NO.1: District:- Srikakulam, S.R.O.:- Narasannapeta, Sub-Division:- Srikakulam, village:-Gottipalli Mandal:- Narasannapeta Plot No.328, Nature of Property :- Vacant site Survey No. 11/3 Total Extent:- 100Sq Yard with following boundaries:
Boundaries: EAST:- Vacant site of Plot No.327 of Talla Venkata Nageswara Rao, **WEST:-** Vacant site of Plot No.329 of Tankala Sankara Rao **SOUTH:-** Lay Out Road, **NORTH:-** Vacant site of Plot No.301 of Kuddada Ramakumari
ITEM NO.2 : District:- Srikakulam S.R.O.:- Narasannapeta, Mandal:- Kotabommali, Survey No. 85/4A, Sub-Division:- Srikakulam, village:-Vandrada, Nature of Property :- Vacant site Total Extent:- 823.3 Sq Yard with following boundaries:
Boundaries: EAST: Z.P Road, **WEST:** Water Canal, **SOUTH:-** Road **NORTH:-** Site of Simma Ramakrishna

SAKALABHAKALA SAI KISHORE
ADVOCATE, SRIKAKULAM, CELL NO: 9966493508.

దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న తేజేశ్వరరావు

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం వెలుగు విఒఎలకు చెల్లించాల్సిన ఏడు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని దిగ్బంధిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్.ప్రభావతి, జి.అసిరినాయుడు హెచ్చరించారు. కలెక్టరేట్ సమీపాన జ్యోతిరావు పూలే పార్కు వద్ద విఒఎలు చేపడుతున్న నిరాహార దీక్ష మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఒఎల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు? ఎన్నికల సమయంలో విఒఎల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంత వరకు సర్క్యులర్‌ను రద్దు చేయలేదన్నారు. పైగా వేతన బకాయిలు విడుదల చేయడం అన్యాయమన్నారు. వేతనాలు చెల్లించకుండా పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించక పోవడం వల్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. జెండర్ పేరుతో తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. దీక్షలకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ సంఘీభావం తెలిపారు. ఈ దీక్ష కె.లక్ష్మి, కె.రాజేశ్వరి, పి.జగదాంబ, ఎం.విమల, వై.అనురాధ, బి.భారతి, డి.జోగారావు, జి.యర్రయ్య, శ్రీను, బి.మోహనరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి- కవిటి

ఉద్యమ అభ్యర్థి, విద్యారంగంలో అపారమైన అనుభవం కలిగి, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించుకుందామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు పిలుపునిచ్చారు. మండలంలోని యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు ఆర్.జగదీష్ అధ్యక్షతన కవిటి ఎంపిపిఎస్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్ మాట్లాడుతూ ఊరిలో ఉన్న బడికి ఉరితాడు వెయ్యొద్దని డిమాండ్ చేశారు. సిపిఎస్ కో-కన్వీనర్ జానకిరావు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిషన్ నియమించాలని కోరారు. అనంతరం పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సీతమ్మనాయుడు, కోశాధికారి మనోజ్ మహారాణా, సూర్యం, సందీప్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎందుకీ హేతుబద్ధీకరణ?

మల్లగుల్లాలు పడుతున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం ప్రకటించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) నిర్ణయం సచివాలయ ఉద్యోగులు మల్లగుల్లాలు పడుతున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కారమవుతాయని అనుకుంటే... అసలుకే ఎసరు వచ్చేలా ఉందని ప్రస్తుతం సచివాలయం ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వం చెబుతున్న విధంగా రేషనలైజేషన్ జరిగితే ఒక సచివాలయ ఉద్యోగి తన జీవితంలో ఒక సచివాలయ ఉద్యోగిగానే పదవీ విరమణ చేయాలి తప్పించి వేరే గత్యంతరం లేదని అంటున్నారు.

గ్రామ సచివాలయం

పెడచెవినపెట్టి సమస్యలు

ఓవైపు గ్రామ, వార్డు సచివాయాల్లో ఖాళీలు భర్తీ చేసి, ఉద్యోగుల కోసం క్రమబద్ధీకరణ ఆలస్యం చేయడం వల్ల నష్టపోయిన తొమ్మిది నెలల బకాయిలను అరియర్స్ రూపంలో వెంటనే చెల్లించాలని తాము కోరుతుంటే వాటిని పెడచెవిన పెట్టడం సరికాదని సిబ్బంది వాపోతున్నారు. ఉద్యోగంలో చేరిన తేదీ నుంచి సర్వీసు లెక్కించి, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ నిర్దిష్ట ప్రమోషన్ ఛానల్ వెంటనే ప్రకటించి, పనిభారం తగ్గించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వార్డు సచివాలయాల్లో పనిచేసే శానిటేషన్ సెక్రటరీలకు మిగితా సచివాలయ ఉద్యోగులకు ఉండే సమయపాలన పాటించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని, ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీలకు యాప్‌ల పనిభారం తగ్గించాలని కోరుతున్నారు. ఇవన్నీ పక్కన పెట్టి ఇప్పుడు హేతుబద్ధీకరణ అంటూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదని వారు అంటున్నారు. ఏ ఉద్యోగ సంఘ నాయకులను, ఏ ఉద్యోగ సంఘాన్ని సంప్రదించకుండానే ప్రభుత్వం హేతుబద్ధీకరణపై నిర్ణయం తీసుకోవడం కూడా వారి అసంతృప్తికి కారణమవుతోంది.

మల్టీపర్పస్‌పై వ్యతిరేకత

రేషనలైజేషన్ విధానంలో భాగంగా ఒక సచివాలయ ఉద్యోగి ఏ పనైనా చేయాలన్న నిర్ణయంపై (మల్టీపర్పస్) వారు మల్లగుల్లాలు పడుతున్నారు. సచివాలయ సిబ్బందికి ప్రత్యేకంగా ఒక జాబ్ ఛార్ట్ ఉందని, ఇప్పటికే తాము అన్ని విభాగాల పనులు చేస్తున్నా ప్రత్యేకంగా మల్టీపర్పస్ అంటూ ఇంకా తమపై అదనపు భారం మోపడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, పిఆర్ ఎఇ తదితర విభాగాల్లో పనిచేయాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో తాము ఒకరి వద్ద పనిచేస్తున్నప్పుడు ఇంకొకరి పనికి అందుబాటులో లేనప్పుడు సమస్యలు ఏర్పడుతున్నాయని వారు వాపోతున్నారు.

విధి విధానాలు తెలియజేయాలి

ఉద్యోగులందరికీ ఉద్యోగోన్నతి, సర్వీస్ రూల్స్ పొందుపర్చాలి. ఇప్పటికే ఆర్థికంగా తక్కువ పే స్కేల్స్‌తో కుంగిపోతున్న మా ఉద్యోగులకు ఇలా ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సబబు. తక్షణమే ప్రభుత్వం నియమించిన కమిటీ, ఉద్యోగులంతా వారి స్పందన తెలియచేసేలా చేసి ప్రభుత్వం తద్వారా మాకు న్యాయం చేయాలి. 2047 స్వర్ణాంధ్ర సాధన కోసం అధిక ఉద్యోగర్హతలు కలిగిన సచివాలయ ఉద్యోగులను ఆయా ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల్లో భర్తీ చేసి చేయాలి.

- కూన వెంకట సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్రామ, వార్డు సచివాలయం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

భరోసా కల్పించాలి

గ్రామ, వార్డు సచివాలయాల రేషనైజేషన్ విషయంపై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉండే ఉద్యోగస్తులకు సరైన సర్వీస్ రూల్ కల్పించి, వారిని మాతృ శాఖలకు అప్పగించాలి. సచివాలయం ఉద్యోగుల పదోన్నతులపై స్పష్టమైన మార్గదర్శకాలు కల్పించి భరోసా కల్పించాలి.

- ఉప్పాడ జయకృష్ణ, జిల్లా గ్రామ వార్డు సచివాలయం సంఘం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల వైస్ ప్రెసిడెంట్

సేవలు వినియోగించుకోవాలి

సచివాలయ ఉద్యోగుల్లో చాలామంది బి.టెక్, ఎం.టెక్, పిహెచ్‌డి చేసిన వారు కూడా అన్నారు. సమర్థవంతమైన పాలనకు అనుకూలంగా సచివాలయ ఉద్యోగులపై పనిభారం తగ్గించి ఉద్యోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. రేపటితరానికి అనుగుణంగా మా సేవలు సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలి.

- సిహెచ్.రాజేష్, డిజిటల్ అసిస్టెంట్ల జిల్లా అధ్యక్షుడు

క్రైమ్ కార్నర్

యువకుడు మృతి

నారాయణరావు (ఫైల్)

లావేరు : మండలంలోని గుమ్మడాం పంచాయతీ నాగంపాలెంకు చెందిన రౌతు నారాయణరావు (25) మద్యం మత్తులో మంచినీళ్లు అనుకోని పురుగులు మందు తాగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణరావు సోమవారం రాత్రి మద్యం తాగాడు. కొద్ది సమయం తరువాత దాహం వేయడంతో తన పశువులు శాల వద్ద తాగునీరు అనుకుని పురుగుల మందు తాగేశారు. అనంతరం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి తల్లిదండ్రులు సూర్యనారాయణ, సూరమ్మ ఉన్నారు. కుమారుడు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గాయపడిన వ్యక్తి దుర్మరణం

శ్రీనివాసరావు (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని పాడుగుపాడు సమీపంలో సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బోరుమజ్జిపాలెకు చెందినకరుకోల శ్రీనివాసరావు (55) సోమవారం రాత్రి మృతి చెందాడు. జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య కుమారి, కుమారుడు ధర్మారావు, కుమార్తె రేణుకలు ఉన్నారు. కుమార్తె రేణుకాకు రెండేళ్ల క్రితం వివాహం కాగా, భార్య. కుమారుడులు హైదరాబాద్‌లో కూలిపనుల కోసం వలస వెళ్లాడు. శ్రీనివాసరావు ఒక్కడే బోరుమజ్జిపాలో నివాసము ఉంటున్నాడని గ్రామస్తులు తెలిపారు.

ఎంపిడిఒ మన్మథరావుతో మాట్లాడుతున్న సత్యనారాయణ

పని ఒకరికి... బిల్లులు వేరొకరికా?

పొందూరు: పని ఒకరు చేస్తే బిల్లు వేరొకరికి మంజూరు చేసిన అధికారుల నిర్లక్ష్యంపై టిడిపి సీనియర్ నాయకులు కూన సత్యనారాయణ కాంట్రాక్టర్ బాడాన శేషగిరిని నిలదీశారు. మండలంలోని పెనుబర్తి పంచాయతీ అలమాజీపేటలో చేసిన రోడ్డు పనికి నిమిత్తం బాడాన శేషగిరికి కోర్టు ఆదేశాలతో రూ.4 లక్షలు చెల్లించారు. చెల్లించాల్సిన రెండో బిల్లు రూ. 3,24,939లను 2022 జులై నెలలో అధికారులు పెనుబర్తికి చెందిన వైసిపి నాయకులు టి.మురళీకృష్ణ పేరున వెండర్ కోడ్ సృష్టించి బిల్లును అతని ఖాతాలో వేశారు. పనిచేసిన గిరి ఎన్నిసార్లు బిల్లు కోసం అధికారులను ప్రశ్నించినా సమాధానం ఇవ్వలేదు. ప్రభుత్వం మారిన తరువాత అధికారుల నిర్వాకం బయటపడింది. పనిచేసిన గిరికి బదులు వేరొక వ్యక్తికి బిల్లు చెల్లించినట్లు నిర్ధారణ కావడంతో అధికారులను నిలదీశారు. పంచాయతీరాజ్ ఇఇ సైతం తప్పుడు వెండర్ కోడ్‌తో వేరొకరికి బిల్లు చెల్లించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చినా అధికారులు స్పందించడంలేదు. ఎమ్మెల్యే కూన రవి కుమార్ సైతం ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా సరైన చర్యలు తీసుకోకపోవడంతో పెనుబర్తి మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు కూన సత్యనారాయణ, కాంట్రాక్టు బాడాన గిరి, వార్డు సభ్యుడు బాడాన శ్రీహరి మంగళవారం ఎంపిడిఒ మన్మథరావును కలిసి బిల్లు తక్షణమే మంజూరు చేస్తారా? బాధ్యులైన అధికారులపై కోర్టుకు వెళ్లమంటారా? అని ప్రశ్నించారు. చర్యలు తీసుకుంటామని, బిల్లు తిరిగి ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

వి.జి.కె మూర్తికి నివాళి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బారువలో రైతు సంఘం ఆధ్వర్యాన సిపిఎం నాయకులు వి.జి.కె.మూర్తి సంతాప సభ మంగళవారం నిర్వహించారు. ముందుగా విజికె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మాట్లాడుతూ ప్రజా పోరాటాల్లో మూర్తి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మృతి వామపక్ష పోరాటాలకు తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో దున్న సత్యం, యాదవరావు, పొందర భాస్కర బడిత్య, వెంకట్రావు, వి.కృష్ణారావు, లోకనాథం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలం పాటు ఆర్‌టిసిలోని భాగస్వాములై రేయింబవళ్లు ప్రయాణికులకు సేవలందించిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విశ్రాంత ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆర్‌టిసి ఎండీ ద్వారకా తిరుమలరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు ఎస్.ఎస్.ఆర్.శర్మ, ఎస్.అప్పారావు, జిల్లా అధ్యక్షులు ఆర్.పి.రావులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల మరణాంతరం దహన ఖర్చును రూ.20 వేలు పెంచడం హర్షణీయమన్నారు. అలాగే సూపర్ లగ్జరీలో ఉచిత ప్రయాణం, హయ్యర్ పెన్షన్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లాలో జెమ్స్ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు అనుమతించాలని కోరారు. ఎండీని కలిసిన వారిలో విశ్రాంత ఉద్యోగులు ఉమామహేశ్వరావు, ఎన్.ఆర్.పి.రావు, సత్యం, నారాయణ, పి.ఇ.రావు, ప్రసాద్, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

రక్తదానం మరొకరికి ప్రాణదానం

రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి- పలాస

రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం కాపాడుతుందని టోల్ గేట్ ప్రాజెక్ట్ మేనేజర్ సెంథిల్ కుమార్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద జాతీయ రహదారి భద్రత ఉత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన మంగళవారం ఉచిత రక్తదాన శిబిరం, సోంపేట ఆరోగ్యవరం నేత్రాస్పత్రి ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోవని, ఆ దిశగా డ్రైవర్లు వాహనాలను నడపాలని సూచించారు. అనంతరం 54 మంది రక్తదానం చేయగా, వంద మందికి నేత్ర వైద్య పరీక్షలు పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వి.వి.కె.వి.ప్రసాద్, టోల్ ప్లాజా మేనేజర్ అనీష్ జాన్ పాల్గొన్నారు.

పాల పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలి

ఆమదాలవలస : శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలోని ఉత్తరాంధ్రలో పాల దిగుబడి నిచ్చే పాడి పశువుల మధ్య పోటీ నిర్వహించి అధిక దిగుబడి గల పశువులకు పారితోషికం అందిస్తామని పశుసహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు అన్నారు. ఈ పోటీలు విజయనగరం జిల్లా తోటపాలెంలో ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహిస్తామని తెలిపారు. సాహివాల్ ఒంగోలు గిర్ రాఢీ నాటు ఆవు జెర్సీ క్రాస్ హెచ్ఎఫ్ క్రాస్ పశుజాతుల పశువుల మధ్య పోటీ నిర్వహించి ఒక్కో జాతి పశువులకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతి సాధించిన పశువులకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40 వేలు, తృతీయ బహుమతి రూ.25 వేలు పాడి రైతుకు పారితోషకం అందజేస్తామన్నారు. అలాగే పశువుల రవాణా, వాటి వసతి, దానా నీటి సౌకర్యం, రవాణా సమయంలో బీమా సదుపాయం ఉచితంగా కల్పింస్తామన్నారు. తెలిపారు. ఆసక్తి గల పాడి రైతులు సమీప పశు వైద్యాధికారిని సంప్రదించి పేరును నమోదు చేసుకోవాలని కోరారు.

పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని బాతుపురం హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఎస్ఎస్‌సి ఆల్ ఇన్ వన్ గైడ్ పుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు. యూనిటీ ఫౌండేషన్ అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులందరూ మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులపై భారం పడకూడదని ఎస్ఎస్‌సి ఆల్ ఇన్ వన్ గైడ్ పుస్తకాన్ని వితరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఫలితాల్లో మొదటి స్థానం పొందిన వారికి ట్యాగ్ ట్రోఫీ, నగదు బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌మౌళి, విక్కీ, హరీష్, పృథ్వీ పాల్గొన్నారు.

పుస్తకాలను పంపిణీ చేస్తున్న కిరణ్

విద్యాభివృద్ధిపై సమీక్ష

టెక్కలి : ప్రభుత్వ విద్యాశాఖ తీసుకున్న నూతన నిర్ణయాల్లో భాగంగా పాఠశాల విద్యాభివృద్ధిపై ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి సమీక్షించారు. తన ఛాంబర్‌లో డివిజన్‌స్థాయి డిఇఒలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జిఒ రద్దు చేయడం వల్ల పాఠశాలలు విలీనం, ఉపాధ్యాయులు సర్దుబాటు, మిగులు వంటి అంశాలపై చర్చించారు. విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు లేకపోవడం, విద్యార్థులు లేనిచోట ఉపాధ్యాయులు ఉండడం వంటి పాఠశాలలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల స్థాయిలో మ్యాపింగ్, మౌలిక సదుపాయాలు కల్పన, వసతులు వంటి వాటిని ఆడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్య బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి అనే దానిపై చర్చిస్తూ... సూచనలు చేపట్టారు. సమావేశంలో విద్యాశాఖ డివిజనల్ అధికారి పి.విలియమ్స్, ఎంఇఒలు దాసుపురం చిన్నారావు, నర్సింహులు, అన్నుపురం చిన్నారావు, సవర దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభం, బి.చిన్నవాడు పాల్గొన్నారు.


పలాస : సమీక్షిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

పలాస : కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మోడల్ ప్రీ ప్రైమరీ, ఫౌండేషన్ స్కూళ్ల ఏర్పాటుపై ఆర్‌డిఒ జె.వెంకటేష్ డివిస్థాయి ఎంఇఒలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలకు సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ఎల్‌కెజి, యుకెజి నిర్వహిస్తామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో మిగతా తరగతులు నిర్వహిస్తారని చెప్పారు. ఒకే ప్రాంగణంలో రెండు ఉండడం వల్ల పిల్లలు తెలిగ్గా ప్రాథమిక పాఠశాలలకు అలవాటు పడతారని అన్నారు. 3,4,5 తరగతులను ప్రస్తుతం ఉన్న ఉన్నత పాఠశాల నుంచి వెనుక తీసుకొచ్చి, ప్రతి 45 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని కేటాయించే పద్ధతి ఉంటుందన్నారు. సమావేశంలో ఎంఇఒలు బోడ వెంకట రమణ, చెరుకుపల్లి సత్యం పాల్గొన్నారు.

రూ.ఐదు లక్షల కోట్ల పెట్టుబడులు

ప్రజాశక్తి- కొత్తూరు

2019-24లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రూ.11.4 లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయని టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ అన్నారు. కొత్తూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల్లో రూ.5 లక్షల కోట్లు పెట్టిబడులు తెచ్చిన ఘనత సిఎం చంద్రబాబుదేనని అన్నారు. దావోస్ పర్యటన విజయవంతం కావడం సంతోషదాయకమన్నారు. వైసిపి ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను భయభ్రాంతులకు గురి చేసి రాష్ట్రం నుంచి వదిలి పోయారని అన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్‌నాయుడు, టిడిపి నాయకులు ఎద్దు శ్రీనునాయుడు, గాండివలస తేజేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటరమణ

లోకేష్‌ను కలిసిన 'కలమట'

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను సోమవారం విశాఖపట్నంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా మండలంలోని నివగాంలో 2019లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాలు మౌలిక వసతులు ఏర్పాటు విద్యార్థులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించారని అన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పోలాకి : అధైర్య పడవద్దని, అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇటీవల కిడ్నీ వ్యాధి సమస్యతో బాధపడుతున్న పొట్నూరు గోవిందరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి రూ.40,500 చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగ కమిటీ రాష్ట్ర కార్యదర్శి జామి వెంకట్రావు, పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు వూన్న వెంకటేశ్వరరావు, ముద్దాడ గోపాలరావు, కోరాడ వేణుగోపాలస్వామి గుప్తా పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

అల్లెన రోడ్డు కల నెరవేరేనా?

దశాబ్దాలుగా ఎదురుచూపు

అల్లిన రహదారి కల నీటికైనా నెరవేరేనా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు ఆ గ్రామస్తులు. దశాబ్దాల కాలంగా ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారీ తమ రహదారికి మోక్షం లభిస్తుందని ఎదురుచూస్తున్న గ్రామస్తులకు నిరాశే మిగులుతోంది.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అల్లెన గ్రామస్తులకు సరైన రోడ్డు సౌకర్యం లేక అనునిత్యం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. రహదారి కోసం ప్రజా ప్రతినిధులకు అధికారులకు విన్నవించుకున్నా... ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ఉన్న అల్లిన నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు అవస్థలు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో మూడు దశాబ్దాల క్రితం అల్లెన నుంచి బూర్జ మండలం, జిల్లా కేంద్రాలకు వెళ్లేందుకు మదనాపురం నుంచి అల్లెనకు ప్రధాన రహదారి వేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఇంతవరకు ప్రభుత్వాల మారుతున్నా ఈ రోడ్డు ఊసే ఎత్తడం లేదని తెలిపారు. వివిధ పనుల నిమిత్తం వెళ్లలంటే తమ గ్రామం నుంచి గంగాభగీరథపురం, కిలంతిరి, వైపర్త, అంపిలి గ్రామాల నుంచి పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ పట్టణానికి రావాలి. అక్కడి నుంచి శ్రీకాకుళం, బూర్జ వెళ్లాల్సి వస్తుంది. అల్లెన రావాలన్నా పాలకొండ పట్టణానికి వచ్చి అక్కడి నుంచి అంపిలి ఏడు కిలోమీటర్ల దూరంలో రావాల్సి ఉంటుంది. మదనాపురం నుంచి గిరుడుపేట, నీలాపురం గ్రామాలకు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. దీనివల్ల వ్యయప్రయాసలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకవర్గం స్పందించి మదనాపురం నుంచి రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అల్లెన గ్రామ వ్యూ

రోడ్డు నిర్మించాలి

మదనాపురం నుంచి అల్లెనకు రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి. అనునిత్యం శ్రీకాకుళం నుంచి రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- పెంకి తవిటినాయుడు, అల్లెన

అవస్థలు పడుతున్నాం

జిల్లా కేంద్రం శ్రీకాకుళం వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. పాలకులు, అధికారులు స్పందించి మదనాపురం నుంచి రోడ్డును నిర్మించాలి.

- వారాడ ఢిల్లీశ్వరరావు

సంతోషి కుమారిని సన్మానిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి- కవిటి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని కపాసుకుద్దికి చెందిన ఎఎన్ఎం బి.సంతోషి కుమారికి ఉత్తమ సేవా పథకం లభించడం తాను చేసిన సేవలకు గుర్తింపు లభించడమేనని రాజపురం పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ శశిధర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆస్పత్రి ఆవరణలో సంతోషి కుమారి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగికి తాను చేసిన సేవలే గుర్తింపు తీసుకువస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎఒ అభిమన్యు సోయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు

క్విజ్ పోటీలో సత్తా చాటిన 'ఆక్స్‌ఫర్డ్'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ అంశాలపై లయన్స్ క్లబ్, బికెఎస్‌జె కాలేజీ సంయుక్తంగా మంగళవారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సిహెచ్.కార్తీక్, వి.చరణ్‌దీప్, గౌతమ్, హాసిని, సాయి స్పందనల బృందం ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో 17 పాఠశాలల విద్యార్థులు ఆరు గంటల పాటు పోటీ పడ్డారు.

క్రీడాకారునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని తిప్పనపుట్టుకకు చెందిన మజ్జి అజిత్ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఆరో కిలోమీటర్ల పోటీ విభాగంలో జాతీయ స్థాయిలో రాష్ట్రం నుంచి బంగారు పతకం సాధించారు. దీంతో పాటు ఇటీవల నిర్వహించిన మహారాష్ట్రలో 600 మీటర్ల విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ ఏడాదిలో నిర్వహించనున్న ఆసియన్ ఆటల పోటీలకు ఎంపికయ్యారు. అనేక పతకాలు సాధించిన క్రీడాకారుడు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అజిత్ చదువుతున్న ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు రూ.15,500 చందాలు వేసుకుని మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ నర్తు వరప్రసాద్, టిడిపి నాయకులు బోర ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ వరప్రసాద్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఇ, సిఎ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.కల్యాణ్, బండారు రమేష్‌లు 'డేటా కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్ వర్క్స్' పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉపయోగపడే మరిన్ని పుస్తకాలను రచించాలని రచయితలను సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సిఎస్ఇ హెచ్‌డి డాక్టర్ వై.రమేష్, సిఎస్‌టి హెచ్ఒడి డాక్టర్ నరేష్, తంగుడు పాల్గొన్నారు.

సరుకులను అందజేస్తున్న సుప్రజ రౌత్

ఒంటరి మహిళకు సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పాత శ్రీకాకుళం మాఊరి వీధిలో నివాస ముంటున్న ఒంటరి మహిళ జోగి సరస్వతికి మదర్స్ లవ్ ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యం ప్యాకెట్ మంగళవారం అందజేశారు. సరస్వతి భర్త జోగి తవుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆమె వృద్ధాప్యం కారణంగా ఎక్కడా పనిచేసుకునే సామర్థ్యం లేదు. చిరు వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆమె జీవనం కష్టమతోంది. విషయం తెలియడంతో మదర్స్ లవ్ ఫౌండేషన్ నిర్వాహకులు సుప్రజ రౌత్ ఆమెను అక్కడ చేర్చుకుని నెలకు సరిపడ నిత్యవసర సరకులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మదర్స్ లవ్ ఫౌండేషన్ సభ్యులు ఐ.వి.ఆర్.హర్ష, సింగంపల్లి తాతరావు, జిఇఒ సభ్యులు చింతు సంతోషిణి, జోగారావు, జ్యోతి పాల్గొన్నారు.

సిమెంట్ పలక ధ్వంసం

ప్రజాశక్తి- ఆమదాలవలస

విరిగిన సిమెంట్ పలక

పురపాలక సంఘం పరిధిలోని 4 వ వార్డు గేదెలవానిపేట దగ్గర ఉన్న వయోడాక్ట్ బ్రిడ్జి దిగువున మెట్టక్కివలస వైపుకు వెళ్లే రహదారిలో కాలువపై ఉన్న సిమెంట్ పలక ధ్వంసమయ్యాయి. పలుమార్లు పురపాలక సంఘ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. కాలువపై ఉన్న సిమెంటు పలకలు పగిలిపోవడంతో తరుచూ రాత్రిపూట ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటికైనా పురపాలక సంఘం అధికారులు స్పందించి కాలువపై పాడైన సిమెంట్ పలకలను తొలగించి నూతన పలకలను వేసి ప్రజలు వాహనదారుల ప్రాణాలను కాపాడాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

జగనన్న కాలనీపై సర్వే

టెక్కలి : టెక్కలి దరి శ్యాంసుందరాపురం వద్ద నిర్మించిన జగనన్నకాలనీ లబ్ధిదారుల వివరాల కోసం రెవెనూ అధికారులు మంగళవారం ఇంటింటా సర్వే చేపట్టారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ రవికుమార్ పర్యవేక్షణలో సుమారు 20 మంది రెవెన్యూ అధికారులు ఈ సర్వేలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు కేటాయించిన నివాసగృహాల్లో ఉన్నారా? వేరెవరైనా ఉన్నారా? కాలనీ లబ్ధిదారులు ఎంపికలో ఏమైనా అక్రమాలు జరిగాయా? నిజమైన అర్హులైన లబ్ధిదారులు అవునా? కాదా? అనే దానిపై సర్వే చేపట్టారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు యుగంధర్, నరసింహులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు కనిపించవా?

కోటబొమ్మాళి: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో 40 రోజులుగా రైతుల పండించిన ధాన్యం కళ్లల్లోనే ఉండిపోవడంలో నానా ఇబ్బందులు పడుతున్నారని, రైతుల సమస్యలు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి కనిపించటం లేదా? అని కళింగ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు పండించిన పంట ఇంటి, కళ్లల వద్దనే ఉండిపోయాయని అన్నారు. ఇదే అదునగా చూసుకొని ప్రయివేటు వ్యాపారులు వారికి నచ్చిన రేట్లుకు అడుగుతున్నారని అన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు

పలాస : భువనేశ్వర్ రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ ఫిబ్రవరి మొదటి వారంలో పలాస రైల్వే స్టేషన్ తనిఖీ ఉంది. ఈ నేపథ్యంలో స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు మంగళవారం శరవేగవంగా చేపడుతున్నారు. రైల్వే స్టేషన్‌లోని ఫాట్‌ఫారాలపై ప్రయాణికుల కోసం షెడ్లను నిర్మిస్తున్నారు. దీంతో పాటు రైల్వే కాలనీల్లో బిటి రోడ్డు నిర్మాణం, వివిధ కార్యాలయాలకు రంగులు వేస్తుండడంతో రైల్వే స్టేషన్ కొత్తగా కనిపిస్తుంది.

పశువుల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత

శ్రీకాకుళం అర్బన్ : పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పశువుల సంరక్షణను ప్రభుత్వం బాధ్యత తీసుకుందని, అందుకే పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం శ్రీకూర్మం పంచాయతీ జల్లపేటలో పశు శంవర్ధకశాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువుల వల్ల రైతులకు నిత్యం ఆదాయం వస్తుందని అన్నారు. ఈ శిబిరం ద్వారా నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహనా సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జెడి కంచరాన రాజగోపాల్, ఎడి రాజశేఖర్, పశువైద్యాధికారి కిరణ్ పాల్గొన్నారు.

మందస : మండలంలోని సువర్ణపురం, కొండాలోగాంలో హరిపురం పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతిలు పశువులకు వ్యాధినిరోధక టీకాలు, దూడలకు అంతర పరాన్న జీవులు మందులు తాగించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ప్రతినిధి కరగాన వాసు, సవర ఢిల్లేశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి గొరకల కేశవరావు, దున్న హేమరాజు, దున్న కోదండరావు, సాలిన మల్లేష్, సవర త్రినాథ్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని 4వ వార్డు గేదెలవానిపేటలో పశు సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు, దూడలకు నట్టల నివారణ మందులు తాగించడం వంటి వైద్యం అందించారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ స్వాతి, ల్యాబ్ టెక్నీషియన్ సుమతి అటెండెర్ ఉమామహేశ్వరరావు, పశు సంచార వాహన సిబ్బంది మోహనరావు, జయప్రకాష్, సాయికుమార్ పాల్గొన్నారు.

పలాస : ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిపి అధ్యక్షులు ప్రభుదాస్ కోరారు. మండలంలోని చిన్నంచల పంచాయతీలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించి పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో హరియాపల్లి ప్రభుదాస్, కంచరన మధుసూదనరావు, బమ్మిడి సురేష్‌కుమార్, సత్తార సురేష్‌కుమార్, అరియాపల్లి తేజేశ్వరరావు, కూన హేమచలం, కృష్ణారావు, పశు వైద్య మండల అధికారి మధుసూదనరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలో తిర్లంగిలో ఉచిత గర్భ కోశ వ్యాధి చికిత్స శిబిరంలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.జయరాజ్ 51 పశువులకు గర్భ కోశవ్యాధి చికిత్స చేశారు. 55 పశువులకు ఏలిక పాములు నివారణకు మందులు చేశామన్నారు. 205 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. పాడి పశువుల పెంపకంలో పశుగ్రాసాల సాగు, టిఎంఆర్ దాణా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, మాజీ సర్పంచ్ ధవల రామచంద్రరావు, అసిస్టెంట్ డైరెక్టర్ జి.గురునాథ్, పశువైద్యాధికారులు ఎం.పూర్ణచంద్రరావు, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

పొందూరు : మందులను పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి దివ్య

పొందూరు: మండలంలోని కొంచాడలో పశువైద్యాధికారి కె.దివ్య 48 పశువులకు వైద్య సేవలను అందజేశారు. 92 లేగా దూడలకు నట్టల నివారణ మందులను వేశారు. మేకలకు, గొర్రెలకు, కోళ్లకు టీకాలు వేశారు. అలాగే ఎదకు రాని పశువులకు మందులు, చూడి తనిఖీలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ ముగడ తవిటినాయుడు, కార్యదర్శి శ్రీనివాసరావు, విహెచ్‌ఎలు స్వాతి, రాజా, అప్పలరాజు, శివ, దిలీప్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వేరుశనగలో విధిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని పలాస వ్యవసాయశాఖ ఎడి లింగాల మధుబాబు అన్నారు. మండలంలోని గొప్పిలి, గోకర్ణపురం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అపరాలు, వేరుశనగ, నువ్వులు పంటలపైన తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపరాలు పంటల్లో పూత దశలో 13-0-45 ఎరువును కేజీ ఎకరా పొలానికి పిచికాచీ చేయడం వల్ల దిగుబడి పెంచుకోవచ్చని తెలిపారు. జిప్సం ఎరువును 200 కేజీలు ఎకరానికి విధిగా వాడాలన్నారు. సస్యరక్షణ చర్యలు విధిగా చేపట్టాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో స్ప్రింకలేర్లు, పైపులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ దానకర్ణుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు వాసు, పావని పాల్గొన్నారు.

మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న ఎడి మధుబాబు

ఆమదాలవలస :- సస్యరక్షణ చర్యలతో పంటల్లో అధిక దిగుబడిని సాధించవచ్చునని ఎఒ మెట్ట మోహనరావు అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడ, కొరపాం రైతు సేవా కేంద్రంలో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.రాజశేఖర్ టి.లావణ్య పాల్గొన్నారు.

బూర్జ : వేరుశెనగ పంటలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు ఎకరాకు 250 గ్రాముల అసిఫెట్, 500 గ్రాముల కారబెండజిమ్‌మంకోజాబ్ పొడి మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఎఒ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సుంకురాడ, తోటవాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తోటవాడ నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు గేదెల రమణమూర్తి, కొల్లివలస, మామిడివలస, తోటవాడ గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్, సాయితేజ, మౌనిక పాల్గొన్నారు.

నందిగాం : రబి సీజన్‌లో వేరుశనగ చోడి వేసిన పంటలకు వినియోగించుకునేందుకు డిఎపి, యూరియా దిమ్మిలాడ పిఎసిఎస్‌లో అందుబాటులో ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మండలంలోని రౌతుపురం, బడబంద గ్రామాల్లో పొలంలపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

విరాళం అందజేస్తున్న రామరాజు

రూ.25 వేలు విరాళం

కొత్తూరు : మండలంలోని పొన్నుటూరు కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు రామరాజు రూ.25 వేలు చెక్కును ఆయల కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ఎద్దు సంతోష్ కుమార్, విశ్రాంత విఆర్ఒ బలగ అప్పారావు నాయుడు, వి.చంద్రశేఖర రావు, జి.పవన్‌కళ్యాణ్, జి.కృష్ణారావు, కె.తిరుమలరావు, పి.శేఖర్‌బాబు, కె.గోవిందరావు పాల్గొన్నారు.

విచారణ చేపడుతున్న డిఎల్‌పిఒ గోపీబాల

పంచాయతీ నిధుల ఖర్చుపై విచారణ

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం పంచాయతీలో మంగళవారం టెక్కలి డిఎల్‌పిఒ ఆర్.గోపీబాల విచారణ చేపట్టారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమైనట్లు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ మీకోసంలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్పంచ్ పి రమ్య, కార్యదర్శులు, ఫిర్యాదారుడి సమక్షంలో మంగళవారం చేపట్టారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని డిఎల్‌పిఒ తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు పాల్గొన్నారు.

ముగిసిన టెన్నికాయిట్ శిక్షణ

పలాస : పలాస క్రీడా మైదానంలో పది రోజులుగా నిర్వహించిన టెన్నికాయిట్ జాతీయ శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా టెన్నికాయిట్ సంఘ జిల్లా అధ్యక్షుడు మల్లా సంతోష్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు వితరణగా అందించారు. టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పి.తవిటయ్య, సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.వి.జోగా రావు, అథ్లెటిక్స్ సంఘ సాంకేతిక కమిటీ ఛైర్మన్ హరిబాబు, పీడీలు పద్మలోచనం, ఎస్.రామారావు పాల్గొన్నారు.

బీమాతో కొబ్బరి రైతుకు భరోసా

ప్రజాశక్తి- కవిటి

ప్రకృతి విపత్తులతో సతమతమవుతున్న మండలంలోని కొబ్బరి రైతులకు బీమాతో భరోసా లభిస్తుందని ఉద్యాన సహాయ సంచాలకులు ఎస్.శైలజ తెలిపారు. మండలంలోని భైరిపురంలో రైతులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొబ్బరి రైతులు బీమా సదుపాయం వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం - కొబ్బరి బోర్డు - అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఈ కోకోనట్ పామ్ పథకం అందిస్తున్నట్టు తెలిపారు. రైతులు తమ తోటలో ఉన్న 4 నుంచి 15 ఏళ్ల ఆరోగ్యకరమైన చెట్లకు, 16 నుంచి 60 ఏళ్లు ఉన్న చెట్లకు ఒకటి నుంచి మూడు ఏళ్ల వరకు ఇన్స్యూరెన్స్ సదుపాయం పొందవచ్చని అన్నారు. 1 నుంచి 15 ఏళ్ల వయసు ఉన్న చెట్లకు ఏడాదికి ఒక చెట్టుకు రూ.2.25, రెండేళ్లకు రూ.4.16, మూడేళ్లకు రూ.5.90లు ప్రీమియంగా చెల్లించాలని అన్నారు. 15 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న చెట్లకు ఏడాదికి ఒక చెట్టుకు రూ.3.50, రెండేళ్లకు రూ.6.48, మూడేళ్లకు రూ.9.19లు ప్రీమియంగా చెల్లించాలని సూచించారు. ప్రీమియం చెల్లించిన చెట్లకు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నష్టం వాటిల్లితే ఒకటి నుంచి పదిహేనేళ్ల వయసు చెట్లకు రూ.900లు, పదిహేను నుంచి అరవై ఏళ్ల వయసు చెట్లకు రూ.1750లు చొప్పున ఇన్స్యూరెన్స్ లభిస్తుందని తెలిపారు. పూర్తి వివరాలకు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో కానీ, మండల ఉద్యానశాఖ అధికారిని గానీ సంప్రదించాలని కోరారు. అనంతరం చండిపుట్టుగలోని రైతు సేవా కేంద్రంలో మండలంలోని ఉద్యాన, వ్యవసాయ అధికారులతో ఉద్యాన, ఎపిఎంఐపి పథకాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత, హెచ్ఇఒ బాలరాజు, ఎంపిఇఒ లలిత, ఎంఐఎఒ శరణ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడిహెచ్ శైలజ

వ్యాయామ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఇటిగా పనిచేస్తున్న అప్పన్న మాస్టారును మంగళవారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. ఇదే పాఠశాలలో 15 ఏళ్లుగా పార్ట్‌టైం పిఇటిగా పనిచేస్తూ... విద్యార్థులకు ఖోఖో, హైజంప్, లాంగ్ జంప్, కబడ్డీ, రన్నింగ్, తదితర విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. వారిని జిల్లా, రాష్ట్ర, ఆల్ ఇండియా నేషనల్ స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ జిల్లా పిఇటిగా అవార్డు అందుకోవడంతో దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.మాలతి, సర్పంచ్ కొరికాన వెంకట సీతారామరాజు, బంక లక్ష్మీనారాయణ మాజీ సర్పంచ్ కొరికానా వెంకట్రావు, కొరికెన గోవిందరావు, కత్తిర అశోక్, పాఠశాల కమిటీ చైర్మన్ రాజగిరి, జనార్ధన్ పాల్గొన్నారు.

లజపతిరాయ్‌కు నివాళి

ఇచ్ఛాపురం : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

కవిటి: పంజాబ్ కేసరిగా పిలవబడే లాలా లజపతిరాయ్ దేశ భక్తుడని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందుమాధవి అన్నారు. లాలా లజపతిరాయ్ జయంతి వేడుకలు పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సంతోష్ మాట్లాడుతూ మాతృభూమి సేవలో లజపతిరాయ్ సేవలు వెలకట్టలేనివని అన్నారు. సైమన్ కమిషన్ తిరస్కరణలో లజపతిరాయ్ ముఖ్య భూమిక నిర్వహించారని కొనియాడారు. అంతకుముందు లజపతిరాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎఒ రాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో లాలా లజపతిరాయ్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్కూల్ ఛైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి లజపతిరాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, జయకృష్ణ, తులసీదాస్, లోకేష్ పాల్గొన్నారు.

అద్దె ప్రాతిపదికన వాహనాలు కావాలి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 0 నుంచి18 ఏళ్ల మధ్య వయసు గల స్కూళ్లు, అంగన్వాడీ పిల్లలకు చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, టెక్కలి జిల్లా ఆస్పత్రి ఆవరణల్లో ఉన్న బాల భవిత కేంద్రాలకు తీసుకెళ్లేందుకు రెండు వాహనాలు అద్దె ప్రాతిపదికన కావాలని డిఎంహెచ్ఒ డాక్టర్ టి.బాలమురళి ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలను భవితా కేంద్రాలకు చేర్చి పరీక్షల అనంతరం తిరిగి తీసుకెళ్లేందుకు వామనాలు కావాలన్నారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.60 వేలు అద్దె ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నేరుగా 8106419580, 8333047999 సెల్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- సోంపేట

ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు సోంపేట ఎక్సైజ్‌శాఖ పరిధిలో కేటాయించిన రెండు దుకాణాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సిఐ కె.బేబీ ఒక ప్రకటనలో తెలిపారు. మందస మండలంలో ఒకటి, కంచిలి మండలంలో ఒకటి శ్రీశయన సెగిడి తరగతులకు కేటాయించామన్నారు. అర్హులు ఇటీవల మండల రెవెన్యూ అధికారి నుంచి పొందిన కుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్, రూ.2 లక్షలు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 7న కలెక్టర్ సమక్షంలో సమక్షంలో డ్రా తీస్తామన్నారు. డ్రాలో వచ్చిన వారికి షాపులు కేటాయిస్తామని తెలిపారు.

వజ్రపుకొత్తూరు : మద్యం షాపులు ఎక్సైజ్ పాలసీ ప్రకారం గీత కార్మికులకు కేటాయింపులో భాగంగా మండలానికి సంబంధించి ఒక మద్యం షాపు ఏర్పాటుకు శ్రీశయన ఉప కులస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కె.మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 5లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9502627569 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

ప్రథమ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యాన ప్రథమ, సిపిఆర్ చికిత్సపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్డియోపల్మోనరీ రిససిటేషన్, గుండె ఆగిపోయినప్పుడు, ఊపిరితిత్తులు శ్వాసతీసుకోని స్థితిలో ఉన్నప్పుడు, వ్యక్తికి సిపిఆర్ చేయడం ద్వారా ఎలా ప్రాణాన్ని కాపాడవచ్చో వివరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు, ఎముకలు విరిగినప్పుడు ట్రాయాంగిల్ బ్యాండెజ్ ద్వారా ఎలా కట్టుకట్టాలో తదితర ప్రథమ చికిత్స విధానాల కోసం రెడ్‌క్రాస్ సభ్యులు సత్యనారాయణ, చైతన్య తెలిపారు. కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ నోడల్ అధికారి కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న విజయ

ఆమదాలవలస జెడ్‌పిటిసి బెండి గోవిందరావు భార్య సత్యవతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆమె ప్రస్తుతం వంజంగికి సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె మృతి చెందారని తెలుసుకున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం వంజంగికి గోవిందరావు, అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈమెతో పాటు పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు దుంపల అప్పన్న, మిత్రో తదితరులు ఉన్నారు.

వాకీటాకీలను అందజేస్తున్న కామేష్ కుటుంబసభ్యులు

వాకీటాకీలు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో సెక్యూరిటీ సిబ్బంది విధి నిర్వహణకు అవసరమైన వాకీటాకీలను నగరానికి చెందిన కొంచాడ సుందర కామేష్ మంగళవారం అందజేశారు. వాటి విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని అంచనా. తన తండ్రి కొంచాడ రామారావు జ్ఞాపకార్థం వీటిని ఆలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అరసవల్లి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.